## నిర్మించారు.. వదిలేశారు..

నిరుపయోగంగా ఉన్న పల్లె దవాఖాన భవనం

ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామంలో పల్లె దవాఖాన ఆయుష్మాన్ భారత్ భవనాన్ని రూ.23 లక్షలతో గతేడాది నిర్మించారు. దీనిని వినియోగించుకోకపోవడంతో చుట్టు పక్కల ముళ్లపొదలు పెరిగిపోయాయి. రూ.లక్షలతో నిర్మించిన భవనాన్ని తెరవకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. భవనాన్ని తెరిపించి వైద్య సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

-ఇచ్చోడ, మార్చి 24

## ప్రమాదకరంగా కల్వర్టు

బోథ్ నుంచి నిర్మల్ రహదారిలో చించోలి హనుమాన్ మందిర సమీపంలోని కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఓవైపు కుంగిపోవడంతో గుంత ఏర్పడింది. వాహనచోదకులకు దగ్గరికి వచ్చే వరకు గుంత కనిపించకపోతుండడంతో ప్రమాదాలు నెలకొనే పరిస్థితి ఏర్పడింది. ఆదివారం బోథ్‌కు చెందిన యువకులు అక్కడ హెచ్చరికగా బండరాళ్లు ఏర్పాటు చేశారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి అక్కడ కావాల్సిన మరమ్మతులు చేయించాలని, అప్పటి వరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

-బోథ్, మార్చి 24

కల్వర్టు పక్కన హెచ్చరికగా బండరాళ్లు పెట్టిన యువకులు

## జీపీ కార్మికులకు సరుకుల పంపిణీ

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న జాదవ్ రవి

ఉట్నూర్ రూరల్, మార్చి 24 : లక్కారం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సామాజిక కార్యకర్త జాదవ్ రవి నాయక్ ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ లింగాగౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

## మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

మహాలక్ష్మీ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జైనథ్, మార్చి 24 : కూర గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మీ (దేవవ్వ) ఆలయంలో ఆదివారం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కూర, లక్ష్మీపూర్ గ్రామాల ప్రజలు పాడి పంటలతో చల్లగా ఉండాలని బోనాలు సమర్పించారు. దేవవ్వకు మేకలు, కోళ్లు బలి ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అడ్డి లత వెంకట్ రెడ్డి, మాశెట్టి వెంకన్న, లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ అడప తిరుపతి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కల్చప్ రెడ్డి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ప్రకటిస్తున్న జిల్లా అధ్యక్షుడు చౌహాన్ సునీల్

ఎదులాపురం, మార్చి 24 : విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు చౌహాన్ సునీల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వినాయకచౌక్ శిశు మందిర్‌లో ఆదిలాబాద్ రూరల్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం రూరల్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా రాథోడ్ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా జాదవ్ రాంజీ, కార్యదర్శులుగా అర్జున్‌పవార్, శ్రీధర్, మీడియా కన్వీనర్‌గా హెరికుమ్ర జంగు, మహిళా విభాగం కార్యదర్శిగా గౌతమిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు జిజాబాయి, నాయకులు బత్తుల గంగాధర్, తులసీరాం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ వద్ద మృతదేహం లభ్యం

ఎదులాపురం,మార్చి 24 : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ముందు ప్లాట్‌ఫాంపై వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం తెల్లవారుజామున గుర్తించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ద్వారా అతను బెజ్జూర్ మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన గొనే శంకర్ (56)గా గుర్తించారు. అతని బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. మృతుడి తల పగిలి రక్తస్రావం కావడంతో అనుమానాస్పద మృతిగా భావిస్తున్నట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. టూటౌన్‌లో శంకర్ భార్య పార్వతిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఆదిలాబాద్‌కు మెస్త్రీ పని కోసం వెళ్తున్నానని భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని మృతికి గల కారణం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# కుస్తీమే సవాల్

- హోలీ సందర్భంగా సంప్రదాయ పోటీలు
- బజార్‌హత్నూర్‌లో అనాదిగా వస్తున్న ఆచారం
- మహారాష్ట్ర, తెలంగాణ నుంచి తరలిరానున్న మల్లయోధులు

బజార్‌హత్నూర్, మార్చి 24 : ప్రస్తుతం ఎన్నో ఆధునిక క్రీడలు పుట్టుకొచ్చినా గ్రామాల్లో కుస్తీ పోటీలకు ఉన్న ఆదరణ తగ్గడం లేదు. తెలంగాణ సంప్రదాయానికి ప్రతి బింబంగా నిలుస్తున్న కుస్తీ పోటీలంటే పల్లె ప్రజలకు ఎంతో ఇష్టం. ఈ ఇష్టంతోనే ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ గ్రామంలో హోలీ పండుగ సందర్భంగా ఏటా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో కిన్వాట్, నాందేడ్, నాసిక్, నాగ్‌పూర్, హర్యానా, హిమయత్‌నగర్ వంటి ప్రాంతాల నుంచి కాకుండా తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో మల్లయోధులు పాల్గొంటారు. బజార్‌హత్నూర్‌లోని పులాజీబాబా ధ్యాన కేంద్ర సమీపంలోని మైదానంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు.

కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు (ఫైల్)

### కొబ్బరికాయ నుంచి మొదలు

మొదట కొబ్బరికాయ నుంచి మొదలు పెట్టి గ్రామంలో ఉన్న చిన్నారులతో కుస్తీ పోటీలను ప్రారంభిస్తారు. రూ.100 నుంచి రూ.20 వేల వరకు కుస్తీ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ పోటీల్లో మల్లయోధులు తమ ప్రతిభను చాటుతూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తారు. గ్రామపెద్దలే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు.

### మట్టి కుస్తీకే ప్రాధాన్యం

మల్లయుద్ధంలో మట్టి కుస్తీ, మ్యాట్ కుస్తీ అని రెండు రకాలుంటాయి. వీటిలో మట్టి కుస్తీకే ఎక్కువ శారీరక దృఢత్వం అవసరం. సత్తా ఉన్నంత సేపు పట్టు పట్టొచ్చు.

### నిబంధనలు పాటించాల్సిందే

పోటీల్లో కొన్ని నిబంధనలు ఉంటాయి. ఒకసారి ఓడిన మల్లయోధుడు మరోసారి పాల్గొనడానికి అనర్హుడు. నిర్వాహకులు ప్రత్యేకంగా అనుమతిస్తే తప్ప మళ్లీ ఆడరు. పాల్గొనే వారు ముందుగా మైదానంలో కూర్చుంటారు. సమాన యోధుడు ఆసక్తి చూపితేనే తలపడడానికి అంగీకరిస్తారు. తుది నిర్ణయం నిర్వాహకులదే ఈ కుస్తీ పోటీలను తిలకించడానికి వేల సంఖ్యలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివస్తారు.

### సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం

తరతరాలుగా వస్తున్నా ఆచార సంప్రదాయాన్ని నేటికి కొనసాగిస్తున్నాం. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే కుస్తీ పోటీలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మల్లయోధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తాం. గ్రామస్తుల సహాయసహకారాలతో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. -చట్ల వినిల్, గ్రామస్తుడు

## పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఇంద్రవెల్లి, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లతో పాటు పోలింగ్ నిర్వహణ అధికారులకు కల్పించే సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, ఓటర్లకు సరిపడ స్థలం, వివిధ అంశాలపై ఆరా తీశారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలు ఎస్ఐ సునీల్‌ను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి పూర్తి వివరాలు జిల్లా అధికారులతో పాటు ఎన్నికల నిర్వహణ అధికారులకు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్, పోలీస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఉట్నూర్ సీఐ మొగిలి

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, మార్చి 24 : రైతులు తమ పశువులను కాపాడుకునేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్య సిబ్బంది అన్నారు. ఆదివారం బోరిగామ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలి

ఎదులాపురం, మార్చి 24 : హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయాల నడుమ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలని ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. ఆదివారం జిల్లా ప్రజలకు పోలీసు వ్యవస్థ తరపున శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా యువత మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్య నేరమని తెలిపారు. జిల్లా ప్రజలు సురక్షితమైన రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలన్నారు. చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల కార్యక్రమాలు గమనిస్తూ వారికి సరైన పద్ధతిని తెలియజేయాలన్నారు. వాహనాలు పడిపే క్రమంలో అతివేగం, ట్రిపుల్ డ్రైవింగ్ లాంటి కార్యక్రమాలు యువత మానుకోవాలన్నారు.

# ఘనంగా కామదహనం

- పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించిన గిరిజనులు
- సందడిగా మారిన గ్రామాలు

ఇంద్రవెల్లి, మార్చి24 : మండలంలోని గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు ఆదివారం కామదహనం కార్యక్రమం నిర్వహించారు. గిరిజనులు తమ సంస్కృతీ సంప్రదాయ ప్రకారం ఇంట్లో ఉన్న వారి సంఖ్య ఆధారంగా కుడకలు, చెక్కర బిల్లల హారాలు తీసుకొని గ్రామపటేల్ ఇంటికి చేరుకున్నారు. అనంతరం మరికొందరు కలిసి కామదేవతను వెదురు కర్రలతో మతరి, మతారను తయారు చేశారు. సాయంత్రం గ్రామ పొలిమేరలో కామదహనం చేసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సమక గ్రామపటేల్ పెందూర్ భగవంత్‌రావ్, మహారాజ్ యశ్వంత్‌రావ్, భీంరావ్, పోల్లుగూడ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్, మార్చి 24 : నార్నూర్, గాదిగూడ మండలాల్లో కాముడి దహనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద కొమ్ములు, కట్టెలు పేర్చి దహనం చేశారు. దాని చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సందడి చేశారు.

ఇంద్రవెల్లి: సమకలో గ్రామపటేల్ ఇంటి వద్ద కుడకలు, చక్కెర బిల్లల హారాలను సేకరిస్తున్న ఆదివాసీ గిరిజన పెద్దలు

భీంపూర్, మార్చి24 : భీంపూర్ మండలంలోని గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదహనం వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి సేకరించిన కర్రలు, పేడ చక్రాలతో గ్రామం బయట కాముడిని పేర్చి పూజాదికాలు చేశారు. మహాజన్లు ఆచారం ప్రకారం కామదహనం చేసి ప్రసాద వితరణ చేశారు. సోమవారం హోలీ నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి దేశీదారు రవాణా కాకుండా పోలీసులు నిఘా పెట్టారు. సరిహద్దు ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు.

ఇచ్చోడ, మార్చి 24 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించారు. ముక్రా(బీ) గ్రామస్తులు కామదహనం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతి, గ్రామ పటేల్ సురేశ్. గ్రామస్తులు సుదర్శన్, జనార్దన్, శ్రీనివాస్, సాయి, ప్రజలు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, మార్చి 24: మండలంలోని ఘన్‌పూర్, దుర్గాపూర్, సుద్దగూడ, మత్తడిగూడ, గోండ్‌గూడ(జీ) గ్రామాల్లో కాముడి దహనం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ముక్రా(బీ)లో కామదహనం చేస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌లోని గోపాలకృష్ణ మంఠంలో నిర్వహించిన కామదహనం

## రజక సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక

ఎదులాపురం, మార్చి 24 : రజక సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఆదివారం సంఘ భవనంలో ఎన్నికలు నిర్వహించారు. పట్టణ అధ్యక్ష పదవి కోసం నలుగురు పోటీ పడ్డారు. ప్రధాన కార్యదర్శి కోసం ఇద్దరు పోటీ పడ్డారు. అధ్యక్ష పదవి కోసం 46 ఓట్ల తేడాతో సోమేశ్‌పై సంతోష్ గెలుపొందాడు. ప్రధాన కార్యదర్శి కోసం 85 ఓట్ల తేడాతో సంతోష్‌పై ముస్కు వినోద్ గెలిచాడు. అనంతరం రిమ్స్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఎనికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అభినందనలు తెలిపారు.

చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

## ముందస్తు హోలీ పండుగ సంబురాలు



నేరడిగొండ: డప్పు వాయిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, మార్చి 24 : మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ నివాసంలో ముందస్తు హోలీ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు అభిమానులు, కార్యకర్తలు, నాయకులు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను సహజరంగులతో జరుపుకోవాలని కోరారు. సరదగా కార్యకర్తలతో కలిసి డప్పు వాయిస్తూ నృత్యం చేసి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

### హోలీ శుభాకాంక్షలు తెలిపిన బంజారా నేతలు

నేరడిగొండ, మార్చి 24 : మండల కేంద్రంలో ఆదివారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంజారా యువ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ కపిల్ కుమార్ ఆధ్వర్యంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హస్నాపూర్ సర్పంచ్ జాదవ్ ఉపేంద్ర, సోరాజి నాయక్, విక్రమ్ నాయక్, ఉత్తమ్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చోర్‌గావ్‌లో ర్యాలీ తీస్తున్న పోలీసులు, గ్రామస్తులు

నార్నూర్, మార్చి 24 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా చోర్‌గావ్ గ్రామంలో నార్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రహీంపాషా, సబ్ ఇన్స్పెక్టర్ రవికిరణ్‌తో కలిసి ఆదివారం గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా అవగాహన ర్యాలీ తీశారు. సైబర్‌క్రైం, గంజాయి వినియోగం, మహిళలపై జరిగే నేరాలు, డయల్ 100తో పాటు పలు అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామస్తులు కూడా గంజాయి, నాటు సారా తయారు చేసి విక్రయించవద్దన్నారు. చట్ట వ్యతిరేక పనులకు ఎవరైన పాల్పడిన చట్ట ప్రకారం శిక్షింపబడుతారని తెలిపారు. రాబోవు ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. చోర్‌గావ్‌ను మద్యపాన, గంజాయి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

భరంపూర్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్

తాంసి(తలమడుగు), మార్చి 24: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, పుస్తకాలు చదివితే విజ్ఞానం పెరుగుతుందని జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేశ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ అన్నారు. ఆదివారం తలమడుగు మండలం భరంపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సహకారంతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మేకల మురళీధర్, ప్రధాన కార్యదర్శి రహమాన్, సభ్యులు నారాయణ రెడ్డి, విజయ్‌కుమార్, నగేశ్, నర్సింహులు, హరికాంత్, సుధీర్, ప్రశాంత్, కేదారేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి విగ్రహావిష్కరణ వేడుకలు

బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బోథ్, మార్చి 24 : కౌఠ(బీ) గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన పెద్దమ్మతల్లి విగ్రహావిష్కరణ వేడుకలు కొనసాగుతున్నాయి. ఆదివారం గ్రామంలోని పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మీ పోచమ్మ, ఊర పోచమ్మ, ముత్యాల పోచమ్మ, సార్గమ్మ పోచమ్మ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

క్రీడాకారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్, మార్చి 24 : న్యూఢిల్లీలో జరిగే జాతీయ సీనియర్ పురుషుల ఖోఖో పోటీల్లో రాణించి తెలంగాణ రాష్ట్ర సత్తా చాటాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర జట్టు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ నేషనల్స్‌లో పాల్గొనే క్రీడాకారులతో ఆడడం వల్ల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు ఖోఖోలో మరింత ప్రతిభావంతులుగా ఎదిగేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అల్టిమేట్ ప్రీమియర్ లిగ్ పోటీల నిర్వహణ అనంతరం ఖోఖో క్రీడకు క్రీడాకారులకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతాకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవో క్రాంతికుమార్, జాదవ్ హేమంత్ పాల్గొన్నారు.

## పులిమడుగులో హోలీ సంబురాలు

ఉట్నూర్ రూరల్, మార్చి 24 : పులిమడుగు గ్రామంలో ఆదివారం యువకులు హోలీ పండుగ సంబురాలు జరుపుకున్నారు. ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు బాబాశ్యాం, యువకులు పాల్గొన్నారు.